

పల్లె వైద్యానికి.. తాళం..!

- ఎంఎల్ హెచ్‌పీల ఆందోళన బాట
- గ్రామీణులకు అందని వైద్యసేవలు

ప్రజాశక్తి- పూతలపట్టు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు (ఎల్‌ఎంహెచ్‌పి) సమ్మెలోకి వెళ్లడంతో ఆరోగ్య ఉపకేంద్రాలు మూతబడుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో పల్లెజనానికి వైద్యసేవలు దూరమవుతున్నాయి. ఇన్సెంటివ్ ఇవ్వలేదని, వేతనాలు పెంచాలని, పనిఒత్తిడి ఎక్కువగా ఉందంటూ ఎంఎల్‌హెచ్ ఎంపీలు గత నెల 17వ తేదీ నుంచి ఆందోళనకు దిగారు. అప్పటి నుంచి మండలంలోని మారుమూల ఉన్న ఆరోగ్య కేంద్రాలకు తాళం పడింది. కొన్నిచోట్ల సచివాలయ ఏఎన్‌ఎంలు వారికి నచ్చిన సమయంలో వస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆశా కార్యకర్తలు మాత్రం సబ్‌సెంటర్లలో అందుబాటులో ఉన్న ఎలాంటి ప్రయోజనం లేదన్న వార్తలు వినిపిస్తున్నాయి. కానీ క్లినిక్‌లో జ్వరానికి ఇచ్చే కనీస పారాసెట్మాల్ మందు బిల్లలు సైతం అందుబాటులో లేవని ప్రజలు ఆవేదన వెల్లబుచ్చుతున్నారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారు వ్యాధి నిరోధక టీకాలు జ్వరాల భారిన పడినవారు ఉంటారు. వీరికి ప్రాథమిక చికిత్స చేసి అవసరమైతే సమీపంలోని ఆసుపత్రికి రెఫర్ చేస్తుంటారు. ఎంఎల్‌హెచ్‌పిలు లేక పల్లెల్లో వైద్యసేవలు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఉన్నటువంటి అరకొర ఏఎన్‌ఎంలు సర్వేల పేరుతో గ్రామాల్లోకి వెళ్ళిపోతున్నారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు నిరసన కొనసాగిస్తామని ఎంఎల్‌హెచ్‌పిల సంఘం ప్రతినిధులు చెబుతున్నారు.

> గత వారం రోజుల క్రితం మండలంలోని ఒక వ్యక్తి దీర్ఘకాలిక అనారోగ్యంతో ఆసుపత్రుల చుట్టూ తిరిగాడు. ఈ క్రమంలో పెద్దఆసుపత్రి వారు మందులు ఇచ్చి తమ దగ్గరలోని సబ్‌సెంటర్లలో ఉన్న వైద్యసిబ్బంది వద్ద నిత్యం ఇంజక్షన్ వేయించుకోవాలని సూచించారు. బాధితుడు గత మూడు రోజుల క్రితం సబ్‌సెంటర్ వద్దకు వెళ్లి చూడగా ఆశా కార్యకర్తలే ఉన్నారు. దీంతో ప్రైవేటు వైద్యానికి వంద రూపాయలు చెల్లించాల్సి వచ్చింది.

14 రకాల సేవలు..

పల్లె ప్రజలకు ప్రాథమిక వైద్యసేవలు అందించడానికి గతంలో ఆరోగ్య ఉప కేంద్రాలు ఉండేవి వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల కిందట ఆరోగ్యం మందిర్లను (విలేజ్ హెల్త్ క్లినిక్) తీసుకొచ్చింది. 3 నుంచి 4వేల జనాభాకు ఒకటి చొప్పున కేంద్రాలు ఉన్నాయి. ఒక్క కేంద్రంలో బీఎస్సీ నర్సింగ్ చదివిన వారిని ఎంఎల్‌హెచ్‌పిలుగా నియమించారు. వీరు ఒక కేంద్రంలో 14 రకాల వైద్యసేవలు అందజేయాలి. ఏఎన్‌ఎం ఆశా కార్యకర్తలు వీరికి సహకారం అందిస్తుంటారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో విఫలం

ఎంఎల్‌హెచ్‌పిల ఆందోళనల నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా సచివాలయం వారి స్థానంలో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశించింది. పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఈ ఉత్తర్వులు ఇంకా రాలేదని సమాచారం. దీంతో సచివాలయం ఏఎన్‌ఎంలు విలేజ్ క్లినిక్ హెల్త్ క్లినిక్లతో సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ విషయం జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదు. కలెక్టర్ చొరవ చూపి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.



ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి
- వాడ గంగరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు

రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిదో రోజు నిరవధిక సమ్మె చేస్తున్న సిహెచ్‌ఓల సమస్యలను పరిష్కారం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. వారి పనులు వారిని చేసుకొనీకుండా అదనపు పనులన్నీ అప్పగించడంతో వారికి పని భారం పెరగడమే కాకుండా గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు అందడం లేదు. బీఎస్సీ నర్సింగ్ నుంచి డబుల్ పీజీ చేసిన సిహెచ్‌ఓలు గ్రామీణ పీహెచ్సీలో హెల్త్‌సెంటర్లో ఓపీల దగ్గర నుండి అనేక రకాల సేవలు అందిస్తున్నారు. కోవిడ్ సమయంలో కూడా ప్రాణాల తెగించి సేవలందించిన విషయం అందరికీ తెలిసిందే. అలాంటి వారి సరైన వేతనం ఇవ్వకుండా ఇబ్బందులు గురిచేస్తున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వం సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకొని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేసి గ్రామీణ ప్రజల్లో ఉన్న ప్రజలకు వైద్యసేవలు అందే విధంగా చూడాలి. రాష్ట్రంలో 11 వేల మంది విధుల్లో ఉండగా అందులో 10,500మంది మహిళలు పనిచేస్తున్నారు. వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలి, వారు చేస్తున్న పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నది.



గత తొమ్మిది రోజులుగా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న హెల్త్ ఆఫీసర్లు (ఫైల్ ఫొటో)

ఆగని 'గజ' దాడులు

- రోజుకో వైపు దూసుకొస్తున్న ఏనుగులు
- నష్టపోతున్న రైతన్నలు
- పంట పొలాలు ధ్వంసం
- శాశ్వత పరిష్కారం చూపని అధికారులు



ఏనుగులు తొక్కి నాశనం చేసిన వరి పంట

ప్రజాశక్తి- రామకుప్పం: మండల పరిధిలోని రామాపురం తండా గ్రామఅటవీ సరిహద్దుల్లోని పంట పొలాలపై సోమవారం రాత్రి జంట ఏనుగులు దాడులు చేశాయి. గ్రామానికి చెందిన గోవింద నాయక్, రాందాస్ నాయక్, శివకుమార్ నాయక్, కాంగ్రెస్ నాయక్, శంకర నాయక్ తదితరులకు చెందిన వరి పంటను తిన్నంత తిని తొక్కి నాశనం చేశాయి. గత వారం రోజులుగా రెండు ఏనుగులు మండలంలో త్రిష్ట వేసి పంటలు చేతికి అంది వచ్చే సమయానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని భాదితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ సిబ్బంది, ఏనుగుల ట్రాకర్లు తమిళనాడు ప్రాంతానికి మళ్లీచ్చేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారు కానీ ఫలితం లేకుండా పోతోంది. సాయంత్రం సమయానికి పంట పొలాలపై పడి నాశనం చేస్తున్నాయి. జంట ఏనుగులు పగలంతా అడవుల్లో తిరుగాడుతూ... చీకటి పడేసరికి ఏదో ఓ సరిహద్దు గ్రామసమీపంలోని పంట పొలాల్లోకి దూసుకువస్తుండటంతో ఇటు రైతులు, అటు అటవీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని తమకు నష్టమైన పంటకు పరిహారం అందిచాలని, ఏనుగుదాడుల కట్టడికి చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.



విభిన్న ప్రతిభావంతులకు బ్యాటరీ సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్


చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గల 18మంది విభిన్న ప్రతిభావంతులకు ఎంపి ల్యాడ్స్ నిధుల నుండి రూ. 6.30లక్షల విలువ గల బ్యాటరీ ఆపరేటెడ్ సైకిళ్ళను మంగళవారం చిత్తూరు కలెక్టరేట్‌లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జ్ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్ మోహన్, కె.మురళి మోహన్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఏవై. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



బ్యాటరీ ఆపరేటెడ్ సైకిళ్లు అందిస్తున్న మంత్రి

రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ


ప్రజాశక్తి- శాంతిపురం: రైతు బాంధవుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్నివిధాలుగా రైతును ఆదుకుంటూ సకాలంలో సబ్సిడీపై పనిముట్లు సీజన్ ముందే ఇవ్వడం జరిగిందన్నారు. ఇంకా అన్ని రకాల పనిముట్లు అందరి రైతులకు అందేలా ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం రైతులకు డ్రిప్, ఎరువులు, విత్తనాల పూర్తిస్థాయిలో అందరికి అందించాలని తెలిపారు. ఏదైన వ్యవవ్యవసాయ శాఖ సమస్యల ఉన్నా పరిష్కారం చూపుతామని తెలిపారు. మండలంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు, మధర్ డెయిరీ రైతులకు త్వరలో అందుబాటులో తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు మెంబర్ వి.శాంతారామ్ చేతుల మీదుగా రైతులకు సబ్సిడీపై 9 మడకలు, స్ప్రే పరికరాలు పంపిణీ చేశారు. నాయకులు విజయ రామిరెడ్డి, చంద్ర, ఉదయ్, పివి.నాగరాజు, ఆర్ఎస్.మణి, నారాయణ రెడ్డి, మునిరెడ్డి, యోగేంద్ర రెడ్డి, అనసూయమ్మ, శ్యామల, సుగుణమ్మ పాల్గొన్నారు.



వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మెంబర్

మంత్రి రాంప్రసాద్ రెడ్డిని కలిసిన చల్లా బాబు

ప్రజాశక్తి రొంపిచర్ల: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, చిత్తూరు జిల్లా ఇన్చార్జ్ మంత్రి రాంప్రసాద్ రెడ్డి మంగళవారం చిత్తూరు పర్యటన సందర్భంగా పులిచెర్ల మండలంలో పుంగనూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలపై మంత్రితో చర్చించారు. మంత్రి సానుకూలంగా స్పందించి వెంటనే సమస్యల పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. టిడిపి నాయకులు ఉయ్యాల రమణ, సుబ్రహ్మణ్యం నాయుడు, మదనమోహన్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాల అమలులో

జిల్లాను అగ్రగామిగా నిలపండి

భూగర్భ జలాల పెంపునకు చర్యలు చేపట్టండి
జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్చార్జి మంత్రి రాంప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా సచివాలయంలో జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం మంగళవారం జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధ్యక్షతన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, కె.మురళి మోహన్, డిఎఫ్ఓ భరణి, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడల్, డిఆర్ఓ మోహన్ కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చిత్తూరు జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో జిల్లా అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించారని, కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని సమస్యలపై ముఖ్యమంత్రి స్పందించి పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని, మామిడి రైతుల సమస్యలకు పరిష్కారం చూపడానికి చర్యలు చేపడుతున్నారని తెలిపారు. మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా జిల్లా యంత్రాంగంతో కలసి కృషి చేస్తున్నామన్నారు. పిజిఆర్ఎస్‌లో అందే రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రాష్ట్రస్థాయి నుండి జిల్లా స్థాయి అధికారులు కృషి చేయాలని, మండలాలలో వీఆర్‌ఏలు, సర్వేయర్లు చిత్తశుద్ధితో పనిచేయాలని, మ్యుటేషన్, వెబ్ ల్యాండింగ్ వంటి సమస్యల పరిష్కారం చూపాలని రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు. డ్వామా అధికారులు భూగర్భ జలమట్టం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతనం ఎంపి మాట్లాడుతూ పేదపిల్లలకు మానసిక వికాసం, పౌష్టికాహారం అందించడంలో అంగన్వాడీ కేంద్రాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని, నరేగా, ఎంపి ల్యాడ్స్ నిధులతో అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని తెలిపారు. భూగర్భ నీటిమట్టం పెంపుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని, వర్షాకాలం ప్రారంభానికి ముందే చెరువులు, సప్లయ్ ఛానల్స్‌లో మరమ్మతులు, పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. నియోజకవర్గం, మండలాల వారీగా చేపట్టాల్సిన పనులకు సంబంధించి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ సమర్థవంతంగా పని చేయాలని, నేషనల్ హెల్త్‌మిషన్ కింద వైద్య ఆరోగ్య శాఖకు మంజూరైన నిధులతో సకాలంలో పనులు ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఉన్న అన్ని ఆసుపత్రుల భవన నిర్మాణ పరిస్థితులు, సిబ్బంది వివరాలు కేటాయించిన నిధులు వాటి వినియోగం సంబంధించిన సమగ్ర సమాచారం అందించాలని డిఎంఅండ్ హెచ్‌ఓను ఆదేశించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను జెడ్పి సిఈఓను ఆదేశించారు. మామిడి దిగుబడి జిల్లాలో అధికంగా ఉన్నందున ప్రాసెసింగ్ కంపెనీల వారి వద్ద ఉన్న పల్ప్ ఎగుమతి విషయమై సంబంధిత శాఖతో చర్చించడం జరుగుతుందన్నారు. పరిశ్రమలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ద్వారా అందించే పథకాల ప్రోత్సాహకాలతో అర్హులైన వారికి రుణాల మంజూరుకు చర్యలు చేపట్టాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు.


జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మున్సిపాలిటీల్లో, పంచాయతీలలో కేటాయించిన నిధులను అధిక భాగం తాగునీటి సమస్య పరిష్కారానికి కేటాయించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. జెడ్పీ సీఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రానున్న నెల రోజుల్లో తాగునీరు, రోడ్ల నిర్మాణానికి సంబంధించి పనులు పూర్తి చేయాలన్నారు. భూగర్భ జలాల నీటిమట్టంకు సంబంధించి జిల్లాలోని 31 మండలాలలో చివరిస్థానంలో గుడిపల్లి మండలం ఉందని, కుప్పం నియోజకవర్గంలో కూడా నీటి మట్టం తక్కువగా ఉన్నదని, నీటిమట్టం పెంపుంకు ఎన్ఆర్ఈజిఎస్ కింద పనులు చేపట్టడం జరుగుతున్నదన్నారు. జిల్లాలో నరేగా కింద గోకులం షెడ్లు, సిసి రోడ్లు, ఇతర సంబంధిత పనుల నిమిత్తం రూ.88 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని, ఇందులో ఎస్సి, ఎస్టి హ్యాబిటేషన్‌లకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న నిధులు మంజూరు చేయించాలని, రెండు నెలలుగా వేజ్ కాంపొనెంట్ కూడా పెండింగ్‌లో ఉందని, నిధుల విడుదలకు కృషి చేయాలని ఎంపి దృష్టికి తీసుకువచ్చారు. మెటీరీయల్ కొంపొనెంట్స్ జిల్లాకు రూ.140 కోట్లు మంజూరు కాగా ఇందులో రూ.114 కోట్లతో బిటి రోడ్లు, గోకులం షెడ్‌లు తదితర పనులు పూర్తి చేశామని, జిల్లాకు మరిన్ని గోకులం షెడ్ల నిర్మాణాలు అవసరం ఉందన్నారు. సాంఘీక సంక్షేమశాఖ వసతి గృహాల మైనర్ మేజర్ రిపేర్లలో భాగంగా 46 హాస్టల్‌లకు బడ్జెట్ కేటాయించడం జరిగిందన్నారు. ఈ నిధులను విడుదల చేసినట్లయితే రెండు నెలల్లో ఈ పనులను పూర్తిచేసి ఈ విద్యా సంవత్సరానికి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడానికి అవకాశాలున్నాయని తెలిపారు. దాదాపు 70 వేల హెక్టార్లలో మామిడి పంట ఉందని, ఒక హెక్టారుకు 3 నుండి 3.5 టన్నుల పంట దిగుబడి వస్తుందని, దీని ప్రకారం 5.5 లక్షల టన్నుల మామిడి దిగుబడి ఉందని తెలిపారు. మామిడి గిట్టుబాటు ధర ప్రస్తుతం ఒక టన్నుకు రూ.25వేల వరకు ఉందని, మామిడి రైతులకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి ప్రోత్సాహకాలు అందేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. జిల్లాలో మామిడి దిగుబడి అధికంగా ఉన్నందున పల్ప్‌ను టిటిడి ద్వారా భక్తులకు అందజేసేలా అందరి ప్రజాప్రతినిధుల సహకారంతో టిటిడి వారికి లేఖ పంపి వారు సూచించే నాణ్యతా ప్రమాణాలు, ధరలు సంబంధిత అంశాలపై చర్చించేందుకు ఏర్పాటు చేసే కమిటీలో ప్రజా ప్రతినిధులు మామిడి రైతులను కూడా భాగస్వామ్యం చేసేందుకు టిటిడి ద్వారా కమిటీ నియామకానికి చొరవ చూపాలని కోరారు. జిల్లాలో ఈ నెల 4వ తేదీన కురిసిన వర్షానికి జరిగిన పంట నష్టంకు సంబంధించిన వివరాలను సంబంధిత శాఖల ద్వారా సిద్ధం చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 256 అంగన్వాడీ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్ కనెక్షన్, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని, విద్యుత్ కనెక్షన్‌కు సంబంధించి పనులు పూర్తి కావలసి ఉందని, నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తి చేస్తామన్నారు. రహదారులలో గుంతలు పూడ్చడం, రహదారి మరమ్మతుల పనులకు సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకు బిటి రోడ్లు, అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.61 కోట్లతో పనులు చేపట్టి బిల్లులు అప్‌లోడ్ చేశామని, ఇంకా రూ.27కోట్లతో పనులు చేపడుతున్నామని, ఇందులో చిత్తూరు- వేలూరు, యాదమరి- గుడియాత్తం రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు.

ఎమ్మెల్యే గురజాల మాట్లాడుతూ చిత్తూరు జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని, ఈ ఆసుపత్రికి సంబంధించి సమగ్ర నివేదికను అందజేయాలని డిసిహెచ్ఎస్‌కు సూచించారు. ఎమ్మెల్యే మురళీ మోహన్ మాట్లాడుతూ యాదమరి, తవణంపల్లి మండలాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. పూతలపట్టు నియోజకవర్గంలో ప్రతి కుటుంబం మామిడి పంట పై ఆధారపడి జీవిస్తున్నారని, మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. సమావేశంలో జిల్లా పరిషత్, ఆర్‌డబ్ల్యూఎస్, పిఆర్, ఆర్అండ్‌బి, వైద్య ఆరోగ్యశాఖ, హార్టికల్చర్, డ్వామా, పరిశ్రమలు, ఐసిడిఎస్, ఇరిగేషన్ శాఖలపై సమీక్ష నిర్వహించారు.

పిహెచ్‌సిలోనే కాన్పులు జరగాలి

- డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సుధారాణి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి.సుధారాణి మంగళవారం వైద్యాధికారులతో జాతీయ కార్యక్రమాలపై జూమ్ రివ్యూ చేశారు. మాత శిశు మరణాలు రాకుండా ఉండాలంటే గర్భస్థ సమయం నుంచి అందించాల్సిన సేవలు తప్పక ఇస్తూ, హాస్పిటల్‌లో కాన్పులు, బయట కాన్పులు వెంటనే ఎస్ఎన్‌సియుకి రిఫర్ చేసి చికిత్స చేసినట్లయితే మరణాలు లేకుండా చూడొచ్చు అన్నారు. కారణాలను లోపాలను వెతికి రెక్టిపై చేసి పిల్లల మరణాలను నివారించాలన్నారు. కాన్పులన్నీ తప్పనిసరిగా పిహెచ్‌సి, సిహెచ్‌సిలో చేయాలని హైరిస్క్ కేసులు మాత్రం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేయాలన్నారు. సిజేరియన్ ఆపరేషన్ ద్వారా కాన్పులు చాలా తక్కువ ఉండాలని తెలిపారు. ఆర్‌సి హెచ్, ఐడి కి అభ ఐడి తప్పనిసరిగా 100శాతం లింక్ చేయాలని ఏలాంటి షార్ట్‌పాల్ ఉండకూడదని తెలిపారు. వేసవి తీవ్రత ఉధృతిగా ఉన్నందున వడదెబ్బ మరణాలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరి అధికారులపై ఉందని అన్నారు. వడదెబ్బ, వడగాల్పులపై ముందస్తు జాగ్రత్తలను అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఓఆర్ఎస్ విరివిగా సప్లై చేయాలన్నారు. ప్రతి 3వ శనివారం తప్పనిసరిగా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ప్రతి ఆరోగ్య కార్యక్రమాన్ని ప్రతిరోజు ఏఎన్ఎం, ఎమ్మెల్ హెచ్‌పి, ఆశలతో మానిటర్ చేస్తూ ఇంప్రూవ్ చేసుకోవాలన్నారు అప్పుడే మనకు బ్యాక్లాగ్ లేకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రవీణ, అనూష, అనిల్ కుమార్, గిరి, డిఏంఓ వేణుగోపాల్, శ్రీవాణి, కేటి ప్రసాద్, రామ్మోహన్, పిహెచ్‌సి డాక్టర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సుధారాణి

జాతర సందర్భంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరంలో గంగ జాతర సందర్భంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని నగర పాలక ఆరోగ్యాధికారి డాక్టర్ లోకేష్ పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలను ఆదేశించారు. నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఆదేశాల మేరకు.. మంగళవారం బజార్ వీధిలో నడివీధి గంగమ్మ ప్రతిష్టించే ప్రాంతాలను పరిశీలించారు. పారిశుద్ధ్య పరంగా చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. నగరంలో బజారు వీధితో పాటు, మిగిలిన ప్రాంతాల్లో నిర్వహించే జాతర ప్రాంతాల వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ యాక్షన్ ప్లాన్‌పై చర్చించారు. జాతర జరిగే రెండు రోజుల ఎప్పటికప్పుడు పరిసరాలలో శుభ్రంగా ఉంచడం, వ్యర్థాలను తొలగించే పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.



ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలిస్తున్న డాక్టర్ లోకేష్

ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు..

నగరంలో చర్చివీధి, బజార్ వీధి ప్రాంతాల్లో ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు ప్లాస్టిక్ విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా నిషేధిత సింగల్ యూస్ ప్లాస్టిక్‌ను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. ఆరు దుకాణాలకు రూ.18,000 వేలు అపరాధ రుసుం విధించి వసూళ్లు చేశారు.

అభివృద్ధి చూడని బతుకులు!

- తాటి ముంజల అమ్మకమే జీవనాధారం
- ఖాళీ సమయంలో నీళ్ల టెంకాయల విక్రయం
- ఆదుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: పూట గడవడం గగనంగా మారింది. వేసవి కాలంలో తాటి ముంజలు, ఎర్ర నీళ్ల టెంకాయలు అమ్మితేనే అతని జీవనం సాగుతుంది. వృద్ధాప్యం మీదపడుతున్నా బతుకుతెరువు కోసం మండు టెండలో సైతం తిరగాల్సిన పరిస్థితి.. వేసవి కాలం వెళితే ఇక ఎర్ర నీళ్ల టెంకాయల అమ్మకం లేక ఇంట్లోనే తిని తినక కూర్చోవాల్సి వస్తోంది. జీవనానికి మరో మార్గం లేక వచ్చే చాలీచాలని ఆదాయంతోనే బతుకుబండిని ఈడ్చుకొస్తున్నాడు. ఇలాంటి వారు మండలంలో ఎంతోమంది వున్నారు. విశ్రాంతి తీసు కోవాల్సిన వయసులోనూ మండుటెండలో కష్టపడు తున్నా ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోక జీవనం సాగిస్తున్నారు. అలాంటి కోవకే మండలానికి చెందిన నాగయ్య అనే వృద్ధుడి జీవన గాథ ఇది..

తాటి ముంజల అమ్మకమే జీవనాధారం

గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో గంగాధర నెల్లూరు మండలం తూగుండ్రం బజారు వీధిలో నాగయ్య టీవీఎస్ ఎక్సెల్ బండిపై తాటి ముంజలు, ఎర్ర నీళ్ల టెంకాయలు విక్రయిస్తుంటాడు. తన వయసు 60 ఏళ్లు అని తెలిపాడు. గత 25 సంవత్సరాలుగా ఇదే పని కొనసాగిస్తూ జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నానని తెలిపాడు. తనది సొంత గ్రామం మండలంలోని చిన్న వేపంజేరి దళితవాడ అని తెలిపాడు. ఇద్దరు పిల్లలు ఉన్నారని వారు చేతికందే వయసు వచ్చినా తాను ఒకరిపై ఆధార పడకుండా తనకాళ్లపై తాను నిలబడి వ్యాపారం చేసి కుటుంబాన్ని పోషిస్తున్నానని తెలిపాడు.

చాలీచాలని ఆదాయం

రోజంతా అమ్మితే నాలుగు నుంచి ఐదు వందల రూపాయల లోపు ఆదాయం వస్తుందని, తానే చెట్లు ఎక్కి టెంకాయలు కోసుకొచ్చి విక్రయిస్తున్నానని తెలిపాడు. తన వద్ద వున్న పాతకాలం నాటి టివిఎస్ ఎక్సెల్ వాహనంపై టెంకాయలు, తాటి ముంజలు తీసుకొచ్చి మండు టెండలో అమ్ముకుంటున్నానని వాపోయాడు. వాటిపై పెట్టుబడి, వాటిని తీసుకొచ్చేందుకు అయ్యే ఖర్చులు పోను స్వల్పంగా వస్తున్న ఆదాయంతో జీవనం గడవడం దుర్భరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశాడు.



మండుటెండలో తాటి ముంజలు, టెంకాయలు అమ్ముతున్న నాగయ్య

ఆదుకోని ప్రభుత్వం

తాను నిరుపేద అయినా ఇంతవరకూ ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు అందలేదని తెలిపాడు. ప్రభుత్వం ఏదైనా తోపుడు బండి వంటిది అందిస్తే తాను నీడలో అమ్ముకుంటానని, వేసవి ఎండ వేడిమి నుండి కాస్త బయటపడుతానని వాపోయాడు. వయసు మీద పడుతోందని తనకు ప్రభుత్వం వృద్ధాప్య పింఛను, ఇతర పథకాలు ఏవైనా ఇప్పించి ఆదుకోవాలని నాగయ్య కోరుతున్నాడు.

ఓపిక ఉన్నన్ని రోజులు ఇదే వ్యాపారం



నాకు ఓపిక ఉన్నన్నాళ్లు ఈ వ్యాపారం కొనసాగిస్తా.. సుమారు 25 సంవత్సరాలుగా ఈ వ్యాపారం చేస్తున్నా.. ఈ వ్యాపారం సీజన్ సమయంలో మాత్రమే ఉంటుంది.. ఆ తర్వాత ఈ వ్యాపారం ఉండదు.. నాకు ఏ జీవనాధారం లేదు.. ఆ సమయంలో జీవనం సాగడం దుర్భరంగా మారుతోంది. ఈ వ్యాపారం మాత్రమే నాకు జీవనాధారం.. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి..

- నాగయ్య, చిన్న వేపంజేరి దళితవాడ, జిడి నెల్లూరు మండలం.

వైభవంగా గంగ జాతర

ప్రజాశక్తి -బంగారు పాల్యం: బంగారుపాళ్యం మండలంలోని తగ్గు వారి పల్లి పంచాయతీ ఆర్‌ఆర్ నగర్‌లో మంగళవారం గంగ జాతర అత్యంత వైభవంగా నిర్వహించారు. మొదట గంగమ్మ ప్రతిరూపాన్ని ప్రతిష్టించి ఉదయం అంబళ్లు, సాయంత్రం పొంగళ్లు పెట్టి గంగమ్మను ఘనంగా కొలిచారు. విద్యుత్ దీపాలంకరణలతో గంగమ్మ జాతర శోభ ఉట్టి పడేలా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అమాస రాజశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

అమాస రాజశేఖర్ రెడ్డికి ఘన సన్మానం

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: చిత్తూరు డిసిసిబి ఛైర్మన్ గా కొన్ని రోజుల క్రితం అమాస రాజశేఖర్ రెడ్డి కొత్తగా ఎంపికైన విషయం తెలిసిందే. దీంతో యూనియన్ నేతలతో కలిసి అమాస రాజశేఖర్ రెడ్డిని జిల్లా సింగిల్ విండో ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు విజయ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి , అనంతరం తిరుపతిలో వాళ్లింటిలో అమాస రాజశేఖర్ రెడ్డికి శాలువలతో ఘనసన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు తులసి పిళ్ళై , ప్రధాన కార్యదర్శి రమేష్ ,ఉపాధ్యక్షులు దిలీప్, శ్రీధర్, శివారెడ్డి, జాయింట్ కార్యదర్శులు వెంకటరమణ వెంకట ముని, ట్రెజరర్ పట్టాభి, సీఈవోలు సుబ్రమణ్యం రామ్మూర్తి, ఖలీల్ పాల్గొన్నారు.

నేడు ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి -శాంతిపురం: నేడు ఉదయం 9 గంటలకు శాంతిపురం మండల వెలుగు కార్యాలయంలో ప్రభుత్వం వారు నిర్వహించు ఉచిత కుట్టు శిక్షణను ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ శ్రీకాంత్ ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమా న్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనా ఉత్సవాలు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మండలంలోని తగువారి పల్లి పంచాయతీలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధనా ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మొదట గణపతి పూజ, కలశపూజ , పుణ్యవచనం నిర్వహించారు. వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమ్మ, సిద్దయ్య విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హరికథా కాలక్షేపం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వీర బ్రహ్మేంద్రస్వామి భక్తులు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యంను పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

సుబ్రహ్మణ్యంకు పరామర్శ

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : అనారోగ్య కారణంగా కుప్పం పి ఇ ఎస్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న సుబ్రహ్మణ్యంను టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు సుబ్రహ్మణ్యం కుప్పం మండల టిడిపి మాజీ అధ్యక్షులుగా పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని తెలుపుతూ బాధితుడికి మరో ధైర్యాన్ని కల్పించారు. అనంతరం బాధితుడి ఆరోగ్య పరిస్థితిని ఆసుపత్రి వైద్యుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, బెండన కుప్పం బాబు, రాజారామ్ పాల్గొన్నారు.



గంగజాతరలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగ జాతరలో మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి- గంగవరం: గంగవరం మండలంలోని కీలపట్ల పంచాయతీలోని నల్లసానిపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన కొత్త మారెమ్మ గంగమ్మ జాతర' మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు సుఖ సంతోషాలతో జీవనం సాగించాలని గంగమ్మని ప్రార్థించారు.



నాకాబందీ నిర్వహిస్తున్న పోలీసులు

సోమలలో నాకాబందీ

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల బస్టాండ్ కూడలిలో ఎస్ఐ శివ శంకర్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం నాకాబందీ నిర్వహించి వాహనాలు తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపకూడదని వాహన చోదకులకు అవగాహన కల్పించారు. కార్లు, లగేజీ వాహనాల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఆశాకార్యకర్తకు సన్మానం చేస్తున్న వైద్యాధికారి డాక్టరు సురేష్

ఆశా కార్యకర్తకు సన్మానం

ప్రజాశక్తి - యాదమరి: ఉద్యోగ విరమణ చెందిన ఆశా కార్యకర్త వసంతకు ఘన సన్మానం చేశారు. సుమారు 17 సంవత్సరాల పాటు యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కోనపల్లెలో ఆశా కార్యకర్తగా పనిచేస్తూ 60 సంవత్సరాలు నిండడంతో వసంతకు యాదమరి వైద్యాధికారిణి డాక్టర్ సురేఖ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ , లు సిబ్బందితో కలిసి మంగళవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అదే గ్రామంలో ఉంటూ చిన్న చిన్న జబ్బులకు అవసరమైన మందులు అందించడంతోపాటు గర్భిణులకు సలహాలు, సూచనలు అందించారు.



విద్యార్థులతో పి తులసినాథంనాయుడు, పుష్ప

వేసవి శిక్షణకు అనూహ్య స్పందన

ప్రజాశక్తి -గంగవరం: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో కళామందిరంలో ఈనెల 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ తరగతులకు అనూహ్య స్పందన లభిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు పి తులసినాథం నాయుడు, పుష్ప తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుండి 11.30 గంటల వరకు పద్యం, కథ, ఆట, మాట, రాత ద్వారా తెలుగు భాషను, నైతిక విలువలను నేర్పిస్తు న్నట్లు తెలిపారు. 40 నుంచి 50 మంది వరకు పిల్లలు హాజరవుతున్నారన్నారు. పిల్లల్లో నైతిక విలువలను పెంపొందించి, తెలుగు భాష పట్ల అభిరుచినే కలిగించే దిశగా ఈ తరగతులను ఎంతో కాలం నుండి నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.


బోరుబావి ఏర్పాటు



బోరుబావిని ఏర్పాటు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడానికి నూతన బోరు బావులను తవ్వించి, వాటిని వినియోగంలోనికి తీసుకు వస్తున్నట్లు పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము తెలిపారు. మంగళవారం పట్టణ పరిధిలోని ఏడవ వార్డు ప్రాంతంలో నూతన బోరు బావికి మోటారు బిగించి వినియోగంలోనికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజల తాగునీటి సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం నూతన బోరుబావులను తవ్వించి, వాటిని వినియోగంలోనికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు నియోజకవర్గం మైనారిటీ అధ్యక్షులు జాకీర్ అహ్మద్, వేలు, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన



ప్రజాశక్తి -తవణంపల్లి: ఆధునిక వ్యవసాయ పరికరాల ఉపయోగంపై మంగళవారం మండల వ్యవసాయ అధికారి జి ప్రవీణ్ అవగాహన కల్పించారు. డిజిటల్ చెల్లింపులు సులభంగా చేసుకోవడం ఎలా? యూట్యూబ్ , స్మార్ట్‌ఫోన్‌ల వాడకం ద్వారా తాజా వ్యవసాయ అభివృద్ధిలపై సమాచారం, ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు గురించి వివరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి ప్రవీణ్, శిక్షకురాలు లేష్మ, (వ్యవసాయ విస్తరణ అధికారి), (వ్యవసాయ సహాయకుడు రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

- డాక్టర్ శాలిని



అవగాహన కల్పిస్తున్న డాక్టరు శాలిని

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: వేసవి దృష్ట్యా అప్రమత్తంగా వుండాలని డాక్టరు శాలిని పేర్కొన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని ఆశ వర్కర్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శాలిని మాట్లాడుతూ మండలంలో 30 నుంచి 44 డిగ్రీల వరకు వేసవి ఉష్ణోగ్రత వుందని వాటిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ఆశా వర్కర్లు ప్రజలను అప్రమత్తంగా వుంచుతూ వడదెబ్బ నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. వారివారి పరిధిలోని ప్రజలకు అవసరమైతే తప్ప బయ టికి రాకూడదని అత్యవసర పరిస్థితి, విధి లేనిపరిస్థితుల్లో బయటకు వెళ్లాలను కుంటే తడిగుడ్డ, గొడుగు ఉపయోగించి ప్రయాణం చేయాలని సూచించారు. రోజూ నీరు ఎక్కువ గా తాగాలన్నారు. వారివారి పరిధిలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థా లు, నవజాత శిశు సంరక్షణ, పెరుగు దల, అనుబంధ ఆహార సేవలు వివరించారు. సావిత్రి హెల్త్ ఎడ్యుకేటర్ కిశోరి వికాసం , మాతా శిశు సంరక్షణ, సీజనల్ వ్యాధులు నివారణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపరు వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

ప్రజాశక్తి -సోమల : ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరి వికాసంపై గ్రామస్తులకు , మహిళలకు కిశోర బాలికలకు అవగాహన నిర్వహించారు. మహిళా పోలీసులు, అంగన్‌వాడీ టీచర్, ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, బాల్య వివాహాలు, తదితర అంశాలను వారికి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్త గుణవతి పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోనితీర్థం పంచాయతీ పరిధిలోని కైగల్ గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని వైద్య సిబ్బంది, సిడిపిఓ అరుణ శ్రీ ఆధ్వర్యంలో కిశోరి వికాసం సమ్మర్ క్యాంప్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు వల్ల కలిగేనష్టాలు, విద్య ప్రాముఖ్యత, పోక్సో చట్టాల గురించి అవగాహన కల్పించారు. అక్కడికి చేరుకున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తీర్థం హెఈ కాంతమ్మ మాట్లాడుతూ ఋతుస్రావం జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యక్తిగత శుభ్రత గురించి వివరించారు. వడ దెబ్బగురించి జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో జిఎంఎస్ శిరీష, ఆశా వర్కరు సుకన్య, ద్రాక్షాయణి, మాధవి, లక్ష్మి మంజుల పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లిలో

ఎస్ఆర్ పురం : కిశోర బాలికలు రుతు చక్రంలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రతపై ఆ సమయంలో ఎదుర్కొనే సమస్యలపై కార్వేటి నగరం ప్రాజెక్ట్ ఐసిడిఎస్ సిడిపిఓ పద్మ సునంద ఆరిమాకులపల్లి అంగన్వాడి కేంద్రం కార్యకర్త పద్మ ఆధ్వర్యంలో కిశోర బాలికల కిషోర్ వికాసం పై వేసవి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్వేటినగరం ప్రాజెక్ట్ సిడిపిఓ పద్మ సునంద మాట్లాడుతూ కౌమార బాలికలలో రుతు స్రావంలో ఉన్న అపోహలను తొలగించడానికి సలహాలను అందించారు. రుతు చక్రం గురించి వివరిస్తూ బాలికల ఆరోగ్యానికి భవిష్యత్తులో పెద్దయ్యాక పిల్లలను కనడానికి ఎంత ముఖ్యమో వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మమ్మ, అంగన్‌వాడీ సూపరువైజర్లు శాలిని, ఇందిరమ్మ, మహిళ పోలీస్ శోభారాణి ఏఎన్ఎం యమున, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, కిషోర్, బాలికలు పాల్గొన్నారు.



ఎస్ఆర్ పురం లో

బిఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీలో దళిత మహిళ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: బియస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీలో దళిత మహిళ సునీతకు చోటు దక్కింది. తన భర్త టీడీపీ నాయకుడు సౌందర్య రాజు సహకారంతో సామాజిక కార్యక్రమాలతో పాటు టిడిపి బలోపేతానికి అందించిన సేవలను గుర్తించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.., సునీతకు టీఏసీ అడ్వైజరీ కమిటీలో పనిచేసే అవకాశం కల్పించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు లేఖ రాశారు. స్పందన కేంద్ర సమాచార, సాంకేతిక శాఖా మంత్రి జ్యోతిరాధిత్య సింధియా ఆమెకు బియస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ సభ్యురాలిగా పని చేసే అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సహకరించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావును మంగళ వారం చిత్తూరు ఎంపీ కార్యాలయంలో సునీత మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



అంకురార్పణతో ప్రారంభమైన గంగమాంబ జాతర

అమ్మవారి జాతరకు అంకురార్పణ

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర ప్రారంభానికి మంగళవారం ఆలయ కమిటీ అధ్యక్షులు బిఎంకె రవిచంద్రబాబు, సభ్యుల ఆధ్వర్యంలో అంకురార్పణ చేశారు. ఇందులో భాగంగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి, తలపై కలశంతో అమ్మవారిని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో కోడిమాను పూజతో అంకురార్పణ ప్రారంభించారు. ఆపై పట్టణంలోని పెద్దబావి వద్దకు చేరుకుని గంగ పూజ నిర్వహించారు. ముత్తు మారెమ్మ వారికి ప్రత్యేక అభిషేకాధి కార్యక్రమాలతో పాటు మహా మంగళహారతి నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అమ్మ వారికి అంబలి సమర్పించి, పట్టణంలోని సరిహద్దు పూజలను నిర్వహించారు. ఆపై అర్ధరాత్రి 12 గంటలకు ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి జాతర చాటింపు వేయనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్రవిడ కూడలిలోని కుప్పం పట్టణంలో 16 రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో 15వ రోజు ప్రసన్న తిరుపతి గంగమాంబ అమ్మవారి శిరస్సు ఊరేగింపు, 16వ రోజు బుధవారం అమ్మవారి విశ్వరూప దర్శనంతో జాతర ముగుస్తుందని తెలిపారు. అమ్మవారి జాతరకు విచ్చేసే అశేష భక్త జనాన్ని దృష్టిలో పెట్టుకుని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ముందస్తు ఏర్పాట్లను నిర్వహించనున్నట్టు తెలిపారు.

రియల్ టైం గవర్నెన్స్‌లో వాహనాల పర్యవేక్షణ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : నగరపాలక పరిధిలో పారిశుద్ధ్య పనుల్లో వినియోగించే నగరపాలక వాహనాలను రియల్ టైం గవర్నెన్స్ ద్వారా పర్యవేక్షించనున్నట్లు నగర కమిషనర్ పి నరసింహ ప్రసాద్ చెప్పారు. రియల్ టైం గవర్నెన్స్‌లో వాహనాల పర్యవేక్షణ విధానంపై మంగళవారం సాయంత్రం నగరపాలక కార్యాలయంలో ప్రజారోగ్య విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణలో భాగంగా ఇప్పటికే పలు కీలక మార్పులు చేపట్టారు. ప్రతి వార్డు పరిధిలోని వీధిలోకి చెత్త సేకరణ వాహనాలు ఏ సమయానికి వస్తాయి? సంబంధిత ఇన్చార్జి అధికారి ఎవరు? అనే వివరాలతో నేమ్ బోర్డులు ఏర్పాటు చేయించారు. ఇదే సమయంలో చెత్త సేకరణ వాహనాలు ఏ సమయంలో.. ఏ వీధిలో వెళుతున్నాయి? నిర్దేశించిన మార్గాల్లో వెళుతున్నాయా ? ఏ సమయంలో.. ఏ వాహనం.. ఎక్కడ వెళుతుంది అనే విషయాలను రియల్ టైం గవర్నెన్స్ లో పర్యవేక్షించడానికి వీలుగా వాహనాలకు జియో ట్యాగింగ్, జీపీఎస్ ఏర్పాటు చేశారు. జియో ట్యాగింగ్, జీపీఎస్ ద్వారా వాహనాలను నిరంతరం పర్యవేక్షించనున్నారు. ఇదే విషయంపై మంగళవారం చెత్త సేకరణ వాహనాల డ్రైవర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టరు లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



డీపీవోకు సమ్మె నోటీసు అందిస్తున్న దృశ్యం

డీపీవోకు సమ్మె నోటీసు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఈ నెల 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా మంగళవారం గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటరామయ్య, జిల్లా గ్రామ పంచాయతీ అధికారిని కలిసి సమ్మె నోటీసులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మధు, ఉపాధ్యక్షులు మల్లయ్య కార్మికులు పాల్గొన్నారు.



చెరువు పూడికతీత పనులు పరిశీలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చెరువు పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు కట్టమంచి చెరువులో నిర్వహిస్తున్న పూడికతీత, సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, మేయర్ ఎస్ అముద, చుడా ఛైర్ పర్సన్ కఠారి హేమలత, ఇరిగేషన్ అధికారులతో కలిసి కట్టమంచి చెరువులో నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు. కట్టమంచి చెరువు గట్టు పటిష్ట పరచడానికి తీసుకుంటున్న చర్యలపై అధికారులతో మంత్రి సమీక్షించారు. వర్షాకాలం ముందుగానే పూడికతీత పనులు పూర్తి చేయడానికి వీలుగా పనులు వేగంగా చేపట్టాలని మంత్రి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. .పూడికతీత పనులు నిర్వహిస్తున్న తీరు ఎమ్మెల్యే మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే గాంధీ రోడ్డును పరిశీలించారు. రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని నగర కమిషనర్ ను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, ఇతర నాయకులు, ఇరిగేషన్, నగరపాలక అధికారులు పాల్గొన్నారు.



ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేననేజ్‌మెంట్‌పై అవగాహనకల్పిస్తున్న ఎస్పి

ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్ పై అవగాహన


ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో జిల్లా అధికారులకు ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనెజ్మెంట్‌లో బాగంగా, విచారణలో ఆధారాల ప్రాముఖ్యత, శాస్త్రీయ ఆధారాల సేకరణలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆధారాల సేకరణ పద్ధతులు, "చైన్ ఆఫ్ కస్టడీ" ప్రోటోకాల్స్, విచారణలో చేయవలసినవి, చేయరాని పనులు, చర్యలు, డిఎన్ఎ ప్రొఫైలింగ్, సైబర్ ఫోరెన్సిక్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ) అనువర్తనాల వంటి ఆధునిక శాస్త్రీయ పరిజ్ఞానం అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎస్పి మణికంట చందోలు మాట్లాడుతూ ఈ కాలంలో నేరాలు కొత్త రూపాలు దాల్చుతున్నాయి. ఆధునిక నేరాలను ఆధునిక పద్ధతుల్లోనే ఎదుర్కోవాలని, విచారణ సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తే నేరస్థులను శాస్త్రీయంగా, చట్టపరంగా ఎదుర్కోనవచ్చున్నారు. ఈ సందర్భంలో ఆధారాల సేకరణకు అవసరమైన మొదటి ప్రతిక్రియ ఎలా ఉండాలో, సంఘటన స్థలానికి వచ్చిన మొదటి అధికారిగా చేయవలసిన ప్రాథమిక చర్యలపై వివరణ ఇచ్చారు.



అభివృద్ధి పనులు నిర్వహిస్తున్న దృశ్యం

మాట తప్పని చల్లా బాబు

ప్రజాశక్తి -రొంపిచర్ల : పులిచెర్ల మండలం కల్లూరు గ్రామ పంచాయతీలో పుంగనూరు టిడిపి ఇన్‌ఛార్జి చల్లా రామచంద్ర రెడ్డి ఎన్నికలు సందర్భం గా ఇచ్చిన హామీ ప్రకారం కల్లూరు గ్రామానికి అభివృద్ధిలో దూసుకు పోతున్నారు. గత ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో ఓడిపోయినా సరే చెప్పిన మాట ప్రకారం నెరవేర్చారు. కల్లూరు ఈద్గా సిసి ప్లాట్ ఫామ్ రూ.20 లక్షలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడకు రూ.20 లక్షలు, బీసీ హాస్టల్ ప్రహరీ గోడకు రూ.20 లక్షలు, రహమత్ నగర్ డ్రైనేజీకి రూ.7 లక్షలు, కోటపల్లి రోడ్డు డ్రైనేజీకి రూ.7 లక్షలు, కొత్త కాలనీ డ్రైనేజీకు రూ.10 లక్షలు, బిసి కాలనీ ఎంపిపి స్కూలు ప్రహరీ గోడకు రూ.15 లక్షలు ఈరసనిపల్లి డ్రైనేజ్ కాలువకు 5లక్షలు మంజూరు చేశారు. దాదాపు 60 శాతం పనులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా చల్లా బాబు కల్లూరు గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకున్నారు.



గంగజాతరలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - యాదమరి: యాదమరి గంగమ్మ జాతరలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు. యాదమరి మండల కేంద్రంలో ప్రతి సంవత్సరం అత్యంత వైభవంగా నిర్వహించే గంగమ్మ జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాతరకు ముఖ్య అతిథిగా హాజరైన పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్‌కు యాదమరి మండల నాయకులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండేలా కోరుకున్నానని తెలిపారు.